క్లుప్తంగా

ఆరోగ్య బీమా కార్డులు అందజేత


దమ్మపేట కోర్టులో లాయర్లకు ఆరోగ్య బీమా కార్డులను అందజేస్తున్న జడ్జి రామారావు

దమ్మపేట: మండల పరిధిలోని బార్ అసోసియేషన్ లాయర్లకు ఆరోగ్య బీమా కార్డులను, దమ్మపేట కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి రామారావు చేతులమీదుగా గురువారం అందజేశారు. ఈ బీమా కార్డుల ద్వారా రెండు లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సహాయంను పొందవచ్చని జడ్జి తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మారం సతీష్‌కుమార్, గొంది మురళీమోహన్, ఉడతనేని శ్రీనివాసరావు, లక్కినేని నరేంద్రబాబు, భవాని ప్రసాద్, శ్యాం సుధాకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: పట్టణంలోని గొల్ల బజార్ వీధిలో నిరుపేద విద్యార్థి ముదిగొండ జస్వంత్‌కు మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. జస్వంత్‌కు టీజీఈఏపీసీఈటీ – 2024 మహబూబాబాద్‌లోని జేఎన్టీయూ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఈఈలో సీటు వచ్చింది. ఇంజనీరింగ్ చదువు కోసం రూ.17 వేలు భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి, చోళ ఇన్‌స్రూ మేనేజర్ వి.బాలరాజు, జిలకర నాగరాజు, కోమటిరెడ్డి చైతన్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురంకు చెందిన ఆటోడ్రైవర్ కనకం నాని ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేత్కర్‌నగర్ కాలనీవాసుల సహాయంతో సేకరించిన రూ.10 వేల నగదును మృతుని భార్య బేబీషామిలీకి అందజేశారు. కనకం రవి, కనకం శ్రీను, కొలూరి ప్రసాద్, కనకం రాము, తాండ్ర సమ్మయ్య, కనకం రాములు, బండ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడు మృతి

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో జనరల్ మజ్దూర్‌గా పనిచేసే కార్మికుడు బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎస్ఐ మేడ ప్రసాద్ కథనం ప్రకారం.. కార్మికుడు గుగులోత్ నగేశ్ తరచూ అనారోగ్యం బారిన పడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుండెనొప్పి రాగా కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సింగరేణి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడి సోదరుడు గుగులోత్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ సిబ్బందికి సన్మానం

మణుగూరురూరల్: మణుగూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ సోయం ముద్దరాజు, ఉద్యోగులు రవికుమార్, సత్యనారాయణ, జానీలను గురువారం తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ కృష్ణ, ఆర్ఐలు లీలావతి, శ్రీనివాస్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

దుమ్ముగూడెం: ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక పిలుపునిచ్చింది. గురువారం లక్ష్మీనగరం గ్రామంలో సమావేశమైన వారు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ గూడెలలో గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించి ఆదివాసీ ప్రజానికానికి దినోత్సవ వేడుక గురించి తెలియపరచాలని అన్నారు. ఆగస్టు 9న మండల కేంద్రంలో చేరుకొని ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో కొమ్ముసత్యాలతో, డోలు సన్నాయిలతో, రేలా పాటలతో, సంబరంగా భారీ జనసంద్రతతో ర్యాలీ నిర్వహించి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు తెల్లం హరికృష్ణ, కనితి రాముడు, తునికి కామేశ్వరావు, సోంది మల్లురు, కొమరం గజేంద్ర, వెంకటేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

దమ్మపేట: గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ తరపున ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన తాండ్ర వినోద్‌రావు జన్మదిన వేడుకలను, జిల్లా నాయకులు మడివి రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గురువారం దమ్మపేట గ్రామంలో కేక్ కట్ చేసి, అందరికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పసుమర్తి పుల్లారావు, దొడ్డా సతీష్, దుర్గారావు పాల్గొన్నారు.

వరదలపై స్పందన భేష్

- సహాయక చర్యల్లో పాలుపంచుకున్న పోలీసులు
- జోరువానల్లోనూ ప్రజలకు చేయూత


గంగారం అటవీ ప్రాంతంలో గుంతలను పూడ్పిస్తున్న ఎస్సై రాజశేఖర్, పోలీసులు (ఫైల్)

ములకలపల్లి: ఫ్రెండ్లీ పోలీస్ పేరిట రక్షకభటులు అందిస్తున్న సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వానల్లో అండగా నిలుస్తూ, ముందుకు సాగుతున్నారు. కొట్లాట కేసులు, భూ సరిహద్దుల సమస్యలు, దోపిడీలు, దొంగతనాలు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు, స్థానిక వివాదాలతో సతమతమయ్యే పోలీసులు, క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు, వానలు, వరద సమయాల్లోనూ తమదైన శైలిలో స్పందిస్తున్నారు.

వాగు ఉధృతిలో పోలీసుల రంగ ప్రవేశం..

ములకలపల్లి మండలపరిధిలో ముర్రేడు, పాములేరు, సాకివాగు, పాలవాగు తదితర వాగులు 18 కిలోమీ మేర ప్రహిస్తున్నాయి. వానలకు వాగుల్లో వరద ఉప్పొంగడంతో పలుచోట్ల రహదారి సమస్యలు ఏర్పడగా.. మూరుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. లోలెవల్ చప్టాలపై వరద ఉధృతి అధికంగా ఉండడంతో స్థానికుల రాకపోకలు నియంత్రించడం పెనుసవాలుగా మారుతోంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేస్తున్నారు. అవసరమైన చోట ప్రత్యేకంగా నాకాబందీ ఏర్పాటు చేస్తున్నారు, వరద ఉధృతి తగ్గే వరకూ అక్కడే ఉండి స్థానికులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలను చైతన్య పరిచేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'వరద ప్రమాద హెచ్చరిక'అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం గమనార్హం. పాల్వంచ సీఐ ప్రవీణ్‌కుమార్ సైతం ఆయా ప్రదేశాలను పరిశీలించి, పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

పనులు చక్కబెట్టడంలో చొరవ..

ములకలపల్లి శివారులోని పాములేరు వాగు, ముత్యాలంపాడు సమీపంలోని పాలవాగుపై నూతన వంతెనల నిర్మాణాలకు గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. పనులు మొదలుపెట్టినా, ఇంకా పూర్తికాలేదు. వర్షాలకు ఇప్పటికే పలుమార్లు డైవర్షన్ రోడ్లు కొట్టుకుపోయాయి. ములకలపల్లి శివారు పాములేరు వాగు డైవర్షన్ తెగిపోవడంతో అప్పటి ఎస్సై రాజమౌళి ప్రత్యేక చొరవతో మూడు రోజులు శ్రమించి, సంబంధితశాఖ అధికారులు మరలా డైవర్షన్ నిర్మించారు. దీనితోపాటు 13 లక్షలతో ఇనుప వంతెన నిర్మించి, రాకపోకలు పునరుద్దరించారు. ముత్యాలంపాడు పాలవాగు డైవర్షన్ తెగిపోవడం పరిపాటిగా మారింది. ఈసీజన్‌లో ఇప్పటికే మూడుసార్లు తెగిపోగా, పోలీసులు దృష్టి సారించారు. వాగు ఉధృతి పరవళ్లు తొక్కుతున్న ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేసి, రాకపోకలు నియంత్రించారు. కాగా జ్వరంతో బాధపడుతున్న 11 నెలల బాలుడు శ్రీహాన్ ను కానిస్టేబుల్ తిరుపతి స్థానికుల సహాయంతో వాగు దాటించి, అస్పత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో పోలీస్ నిఘా నడుమ మోరీలపై తాత్కాలికంగా సీసీ రోడ్డును నిర్మించారు. వర్షాలకు మండలపరిధిలోని గంగారం అటవీప్రాంతంలో బీటిరోడ్లు గుంతలుపడగా, దీనిలో దిగిన ఓకారు ప్రమాదానికి గురైంది. దీంతో స్పందించిన నూతన ఎస్సై రాజశేఖర్ ప్రత్యేక శ్రద్ద చూపారు. యుద్దప్రాతిపదికన సిమెంట్, కాంక్రీట్ కలిపిన వెట్‌మిక్స్‌కు వేయించి గుంతలు పూడ్చారు. వాహనదారులకు రహదారి తిప్పలు తొలగించారు.

మొక్కలు నాటిన జీఎం


మొక్క నాటుతున్న సింగరేణి జీఎం, అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు

మణుగూరుటౌన్: సకల జీవకోటి మనుగడ హరిత వికాసంతో ముడిపడి ఉన్నదని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. గురువారం సీఅండ్ఎండీ బలరాం సూచనల మేరకు వృక్షారోపన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు రాఘవరెడ్డి, శ్రీనివాసరావులతో కలిసి మొక్కలు నాటారు. వాయు కాలుష్యం పెరుగుతున్న కారణంగా కాలుష్యరహిత మొక్కలు నాటకపోతే అనేక రుగ్మతల బారిన పడతామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 22వేల మొక్కలు నాటి 5,500 మొక్కలు పుర గ్రామస్తులకు పంచామన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఓసీలోని ఖాళీ ప్రాంతంలో 1000 మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు పంచారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, శ్రీనివాసచారి, వెంకట్రావ్, ఎస్ రమేష్, శ్రీనివాసమూర్తి, శేషగిరిరావు, అనురాధా, ఏఐటీయూసీ నాయకులు సాయి ప్రకాశ్, ఐఎన్‌టీయూసీ నాయకులు కృష్ణంరాజు, సీఎంఓఏఐ అధ్యక్షుడు కృష్ణమూర్తి, రాజేశ్వరరావు, భాస్కర్‌రావు, అవినాష్, శ్రీనివాసరావు, ప్రవీణ్, సాయిల సురేశ్, కల్యాణ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రుణ మాఫీకి కృషి చేస్తా


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు

చంద్రుగొండ: ఏజెన్సీలోని రైతుల వ్యవసాయ రుణాల మాఫీకి కృషి చేస్తానని డీసీసీబీ చైర్మెన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మండలకేంద్రం చంద్రుగొండలోని డీసీసీబీ బ్యాంకును గురువారం ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా గుంపెన, గానుగపాడు గ్రామాల్లోని సొసైటీల చైర్మన్లు బోయినపల్లి సుధాకర్‌రావు, చెవుల చందర్‌రావులు మాట్లాడుతూ ఏజెన్సీలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేవని, ఆడంగల్ పహాణీలపైనే రుణాలు పొందారని వివరించారు. స్పందించిన వెంకటేశ్వరరావు సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. అనంతరం వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, నాయకులు దార వెంకటేశ్వరరావు, మేడా మోహన్‌రావు, బ్రాంచ్ మేనేజర్ ప్రసన్న, సొసైటీ సీఈఓ లంక నర్సింహారావు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: సహకార బ్యాంకుల అభివృద్ధి కొరకు డిపాజిట్లను పెంచాలని జిల్లా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఉద్యోగులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సహకార బ్యాంకును సందర్శించిన డీసీసీబీ చైర్మన్, బ్యాంకు లావాదేవీల గురించి మేనేజర్ మమతాను అడిగి తెలుసుకున్నారు. గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు, పట్టాదారు పుస్తకాలు లేని రైతులకు కూడా రుణమాఫీని వర్తింపచేయాలని డీసీసీబీ చైర్మన్‌ను కోరారు. అనంతరం ఆయనను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది సాయి, స్వరూప, జ్యోతి, గ్రామస్తులు భారత రాంబాబు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటన


శేషగిరిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి: మండలపరిధిలోని పలుకుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం విస్తృతంగా పర్యటించారు. రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడ్డ గుట్టగూడెం టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సున్నం రాజును పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటుంటామని భరోసా ఇచ్చారు. గాల్‌బ్లాడర్ ఆపరేషన్ చేయించుకుని, విశ్రాంతి తీసుకుంటున్న ములకలపల్లి సీనియర్ విలేకరి అయితా శేషగిరిని పరామర్శించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బైక్ యాక్సిడెంట్‌లో గాయపడ్డ మాజీ వైస్‌ఎంపీపీ గోలి రమణను మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. సుందరయ్య నగర్‌లోని రమణ స్వగృహానికి వెళ్లి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వేపలగడ్డకు చెందిన ఏసుపాక వెంకటేశ్వర్లును పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, పుల్లారావు, సత్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉపకరణాల వితరణ

దమ్మపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన విద్యుత్ ఉపకరణాలను, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మెచ్చా నాగేశ్వరరావు గురువారం వితరణగా ఏర్పాటు చేశారు. బుధవారం కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో అనారోగ్య బాధితులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను, మాజీ ఎమ్మెల్యే మెచ్చా అందజేసిన విషయం విదితమే. కాగా ఆ సమయంలో ఆస్పత్రిలో విద్యుత్ ఉపకరణాలైన కొన్ని ఫ్యాన్లు, బల్బులు పనిచేయకపోవడం గమనించారు. గురువారం రెండు కొత్త ఫ్యాన్లు, అరు ఎల్ఈడీ బల్బులను వితరణగా ఆస్పత్రిలో ఏర్పాటు చేయించి, నాలుగు ఫ్యాన్లకు మరమ్మతులు చేయించారు.

మృతులకు నివాళి..

అనారోగ్యంతో మృతి చెందిన వారి భౌతిక కాయాలకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా గురువారం పూలమాలతో నివాళులర్పించారు. మండలంలోని మల్కారం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బత్తుల వెంకటముత్యం భౌతిక కాయాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లచ్చాపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కొవ్వలి వెంకటేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రూప్‌సింగ్, రావూరి వీరయ్య, ధనరాజ్, గోవిందరావు, నల్లపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

మణుగూరురూరల్: హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీలో మణుగూరు మండలంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు రిషిక, రక్షిత్ మొదటి, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం ప్రధానోపాధ్యాయులు సాయికృష్ణప్రసాద్ అభినందించారు. పాఠశాల అకడమిక్ డీన్ ఎం.నరేష్‌తో పాటు భాస్కర్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కరకగూడెం: నేడు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 10.30 గంటలకు మండల ఎంపీపీ రేగా కాళికా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కరకగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవ వర కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిదులు,అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలన్నారు.

31న ములకలపల్లిలో..

ములకలపల్లి: ములకలపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మట్ల నాగమణి అధ్యక్షతన ఈనెల 31వ తేదీన ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ భారతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల వితరణ

బూర్గంపాడు: బూర్గంపాడులోని గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ రెండు పాఠశాలల్లో చదువుతున్న 200మంది విద్యార్థులకు గురువారం స్కూల్ బ్యాగులను అందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమారిటియాన్ ఫర్ ద నేషన్ ఫౌండర్ రామ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు..

దుమ్ముగూడెం: మండలంలోని ఎస్.లక్ష్మీపురం గ్రామంలోని జీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ఎఫికర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నులు, పెన్సిల్, రబ్బర్, ఎరేజర్, స్కేల్, పలకలు, తెలుగు కాపీ రైటింగ్, ఇంగ్లీష్ కాపీ రైటింగ్ బుక్స్‌ను అందజేశారు. పాఠశాల టీచర్ రఘు దాతను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్తిబాబు, గంగరాజు, భద్రయ్య, బాబురావు, ధర్మరాజు,బతకయ్య, ఎఫికోర్ స్టాఫ్ కిరణ్ బాబు, జాన్ బాబు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాధునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కొంకా సుధాకర్–వసంత దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీనాథ్, చైతన్య, శ్రీయ,అనుదీప్‌లు ఆలయంలోని సాయిబాబాను దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కురుస్తున్నాయ్..


ఇళ్లపై పట్టాలు కప్పుకున్న లబ్ధిదారులు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ శివారు తిప్పనపల్లి వాగు వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లన్నీ కురుస్తున్నాయని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అప్పటి ప్రభుత్వం పేదల కోసం ఇక్కడ 40 ఇళ్లు నిర్మించింది. ఈ పాంతంలో నిర్మాణాలే వివాదాస్పదం అయ్యాయి. కేటాయించిన ఇళ్లు వర్షాలకు పూర్తిగా కురుస్తుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. తాగునీటి సదుపాయం లేదని, విద్యుత్ సరఫరా అంతంత మాత్రంగానే ఉందని బాధితుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో ఉన్న రోడ్లన్నీ బురదమయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. కురుస్తున్న ఇళ్లపై ప్లాస్టిక్ కవర్లు వేసుకోవాల్సి వచ్చిందని లబ్ధిదారురాలు విజయ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని ఇళ్లకు మరమ్మతులు చేయించడంతోపాటు సదుపాయాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో వైద్య శిబిరాలు

చర్లరూరల్: చర్ల మండలంలోని కొయ్యూరు, సత్యనారాయణపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీధర్, దివ్యనయనలు గురువారం మారుమూల ఏజెన్సీ గ్రామాలు ఎర్రబోరు, నాయకుల కాలనీ మరియు కొత్తపల్లిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డయేరియా వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ అధికారుల సహకారంతో నీరు నిల్వలు ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేయాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్య శిబిరాలలో సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరంలో..

మణుగూరురూరల్: మండల పరిధిలోని విజయనగరంలో గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది గ్రామస్తులకు పలు రకాల వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. వీరిలో పలువురి జ్వరబాధితుల రక్తనమూనాలను సేకరించారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు చేసి బాధితులకు మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తుల ఇళ్లను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఇళ్లల్లోని నీటి నిల్వలను శుభ్రం చేయించారు. నీటి నిల్వ కుంటల్లో, మురుగునీటిలో దోమలనివారణ మందును చల్లారు. అనంతరం సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పారాణి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, శైలజ, ఎంఎల్‌హెచ్‌పీలు వినయ్, మనీషా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ విధానంతో లాభాలు


బూర్గంపాడు: డ్రమ్ సీడర్‌తో వరి విత్తుతున్న రైతు, సూచనలు చేస్తున్న మైరాడ ప్రతినిధులు

బూర్గంపాడు: డ్రమ్ సీడర్ విధానంతో రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని మైరాడ సంస్థ మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. ఐటీసీ మిషన్ సునేరికల్(బంగారు భవిష్యత్), మైరాడ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు లబ్ధి చేకూర్చే ప్రక్రియలో భాగంగా కొమ్మునకిరిపేట గ్రామంలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తుకునే విధానాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన గిరిజన రైతు మడకం స్వప్న మాగాణిలో గురువారం డ్రమ్ సీడర్‌తో వరి విత్తే పద్ధతితో పంటసాగు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీల కొరతను అధిగమించటంతో పాటుగా పెట్టుబడులు తగ్గించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. నీటి ఎద్దడిని తట్టుకుని పంట దిగుబడులు పెంచటంలో కూడా ఈ విధానం ఉపకరిస్తుందన్నారు. ఎకరాకు రూ.5 వేల నుంచి 7 వేల వరకు అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు ఈ విధానం తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ఎంఎస్‌కే అధికారి గీత, మైరాడ సంస్థ కోఆర్డినేటర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వితరణ


అశ్వారావుపేటరూరల్: ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: స్థానిక అమ్మసేవా సదనానికి అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గురువారం ఆర్థిక సాయాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్యే తాటి సతీమణి రత్నకుమారి 9వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అశ్వారావుపేటలోని అనాధ శ్రమానికి రూ.10వేల నగదుతోపాటు, అనాథ వృద్ధులకు పండ్లు అందజేశారు. ఆశ్రమ నిర్వహకురాలు కూరపాటి అనసూయ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సత్యవరపు సంపూర్ణ, మాజీ సర్పంచ్ పాట్బా రాజులు, మోటూరి మోహన్, చిప్పనపల్లి శ్రీను, సోమాని రాజా రమేష్ పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని కూనవరం రోడ్డులోని సరోజిని వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తన భార్య రత్నకుమారి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమంతోపాటు వృద్ధులకు 150 దుప్పట్లు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మ పాల్గొన్నారు.

వైద్యులకు ప్రజాప్రతినిధుల సన్మానం

మణుగూరుటౌన్: ఒకేరోజు 12 కాన్పులు చేసిన మణుగూరు 100 పడకల ఆస్పత్రి వైద్యులను మణుగూరు మండల కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ భవానీ, సూపరింటెండెంట్ సునీల్, స్టాఫ్ నర్సులను సిబ్బందిని ఆస్పత్రిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రజలకు మున్ముందు మరిన్ని వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీరంకి వెంకట్రావ్, పాలమూరి రాజు, గాండ్ల సురేశ్, బొజ్జ త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

'రాయల'కు ఘన నివాళి


అశ్వారావుపేటరూరల్: చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పార్టీ నాయకులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు గ్రామంలో రాయల చంద్రశేఖర్ సంతాప సభను గురువారం నిర్వహించారు. ముందుగా రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. విప్లవోద్యమంలో ప్రజల ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. ఆయన ఆశయాలు, పోరాటాల స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాడిస లక్ష్మణరావు, ధర్ముల శ్రీరాములు, కుంజా అర్జున్, పండా ముత్యాలు, గొంది లక్ష్మణ్‌రావు, కారం తులసీ, కారం రాజులు పాల్గొన్నారు.

సంతాప సభ..

ములకలపల్లి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరనిలోటని ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి కొర్సా రామకృష్ణ అన్నారు. రంగాపురం గ్రామంలో మండలకమిటీ సభ్యుడు ఓరుగంటి శ్రీను అధ్యక్షతన గురువారం నిర్వహించిన సంతాపసభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, నిరుపేదల జీవన వికాసానికి చంద్రశేఖర్ చేసిన సేవలు అజరామరం అన్నారు. భూక్యా సోమేశ్వరరావు, మందా శ్రీను, బచ్చల రామకృష్ణ, మందా రామకృష్ణ, భూక్యా భాస్కర్‌రావు, యర్రగొర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

దమ్మపేట: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్, సంతాప సభ గోడ పత్రికలను మండల కేంద్రం దమ్మపేటలో పార్టీ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరని లోటు అని, ఆయన పార్టీ కోసం చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఈ నెల 28న ఖమ్మంలో జరగనున్న సంతాప సభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కుర్సం ముత్యాలరావు, కీసరి వెంకటేష్, పండూరి వీరబాబు, అనిల్, నాగమణి పాల్గొన్నారు.